క్లుప్తంగా

ఇంజినీరింగ్ అధ్యాపకుడికి డాక్టరేట్


చక్రపాణి

కడప ఎడ్యుకేషన్ : కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ఎంఎల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న చక్రపాణికి విట్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విట్ యూనివర్సిటీ ఏఐ అండ్ ఏఎంల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సుగుమరణ్ ఆధ్వర్యంలో 'ఫాల్ట్ డయాగ్నోసిస్ ఆఫ్ ఆటోమోటివ్ డ్రై క్లచ్ సిస్టమ్ యూజింగ్ డీప్ లెర్నింగ్ – మెషీన్ అల్గోరిథం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను చక్రపాణి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకుల బృందం అభినందనలు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

కడప రూరల్ : తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ ఆధ్వర్యంలో 'ఓ విద్యార్థి, యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటు పడుదాం' అనే పోస్టర్‌ను రూపొందించారు. ఈ పోస్టర్‌ను శనివారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు ఏటూరు లోకేష్, చేతన్‌కుమార్‌రెడ్డి, రాజేష్, శివ, ఫరీద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే

వైఎస్ఆర్ జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజును క్యాంప్ కార్యాలయంలో శనివారం కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవితోపాటు, ఆమె భర్త, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కుమారుడితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి మొక్క కుండీని అందజేశారు.

రిమ్స్‌లో పర్యటన

కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో శనివారం రాత్రి కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి, ఆమె భర్త టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పర్యటించారు. రిమ్స్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యత గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిపాల ప్రాధాన్యతను ప్రతి తల్లి గుర్తించాలని సీడీపీఓ రమాదేవి సూచించారు. కడప ఐసీడీఎస్ ప్రాజెక్టులో తల్లిపాల వారోత్సవంలో భాగంగా శనివారం తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని, అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాపించడం వల్ల వ్యాధి నిరోధశక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు శోభారాణి, రేణుక, నాగరత్నమ్మ, పద్మజ, సిబ్బంది రెడ్డెమ్మ, సరోజ, దీప, మహబూబ్‌చాన్, శ్రీవిద్యతోపాటు అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు

ఖాజీపేట : మేఘాలు మేఘామృతమై వర్ష సూచన కనిపించినా ఒక్క రోజూ వర్షం కురవడం లేదు.. దీంతో గ్రామస్థులు వరుణదేవుడి కరుణ కోసం శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపేట మండలం సుంకేశుల గ్రామంలోని రైతులు వరుణ దేవుని ప్రార్థిస్తు గ్రామంలో ఆరాధ్య దైవంగా ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు. వరుణుడు కరుణించి రైతుల కష్టాలను తొలగించాలని ప్రార్థించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం చివరి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉచిత కంటి పరీక్షలు

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామంలో ఎంపీటీసీ రమణ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు మనోజ్ కుమార్, అమర్‌నాథ్‌రెడ్డిలు 250 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంత మందికి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. వీరందరికి ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్లు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తాం

కాశినాయన : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, సభ్యులు రాంభూపాల్‌రెడ్డి, సత్తార్, ఏపీటీఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం


చెత్తను తీసుకొచ్చి కాలనీ శివారులో వేస్తున్న పారిశుధ్య కార్మికురాలు


నివాసాల మధ్యలో అపరిశుభ్రంగా ఉన్న కేసీ కెనాల్ కాలువ

ఇక్కడ కనిపించే దృశ్యాలన్నీ ఏ మారుమూల ప్రాంతాలకు చెందినవి కావు. సాక్షాత్తు కడప నగరం గౌస్‌నగర్‌లోనివి. అసలు విషయానికి వస్తే.. ఇటీవల కాలంలో మౌలిక వసతుల గురించి అటుంచితే.. కనీస పరిశుభ్రత మచ్చుకైనా, ఆఖరికి భూతద్దం వేసి వెతికినా కనిపించదు. ఎటుచూసినా చెత్తాచెదారం, భయంకరంగా ఉన్న మురుగు కాలువలు దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- గౌస్‌నగర్‌లో సమస్యలు తిష్ట
- పేరుకుపోయిన చెత్తాచెదారం
- ఫిర్యాదు చేస్తేనే తొలగింపు
- రోగాల బారిన పడుతున్న స్థానికులు

కడప రూరల్ : గౌస్‌నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా ఒక భాగం చెత్తాచెదారం నిల్వతో డంప్ యార్డును తలపిస్తోంది. ఆఖరికి పారిశుధ్య కార్మికులు కాలువలు, వీధుల్లో ఉండే చెత్తను కూడా తీసుకొచ్చి ఇక్కడే వేస్తున్నారు. అదేమని అడిగితే ఈ ప్రాంతాలలో చెత్తను వేసే పాయింట్ ఎక్కడా లేదని, అందుకని ఇక్కడ చెత్తను వేస్తున్నట్లుగా చెప్పుకొచ్చారు. విచిత్రం ఏమిటంటే చెత్తను తొలగించాలని ఎవరైనా స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే గానీ.. అక్కడ ఉండే చెత్తను తొలగించరని స్థానికులు వాపోయారు. అలాగే ఇక్కడ ఉన్న శ్మశాన వాటికకు ప్రహరీగోడ లేకపోవడంతో అదొక సమస్యగా మారింది. మరోవైపు కాలనీకి మధ్యలో ప్రవహించే కేసీ కెనాల్ కాలువ దారుణమైన అపరిశుభ్రతతో కూడి దుర్గంధభరితంగా మారి దోమలకు నిలయంగా మారడం కూడా కాలనీ వాసులకు పెద్ద శాపంగా మారింది. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కాలువలో ఉన్న నీటి సరఫరా పైపులైన్

గౌస్‌నగర్ అంతా సమస్యలమయం



గౌస్‌నగర్ అంతా సమస్యలమయంగా మారింది. ఇప్పుడు ఉండే సమస్యలను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేకంగా చొరవ చూపాలి. ఒకసారి యంత్రాంగం ఇక్కడ పర్యటించి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుంది.

– పి.ఖాదర్‌బాషా, గౌస్‌నగర్, కడప

ఎప్పటి చెత్తను అప్పుడే తొలగించాలి



మా వీధిలో అన్నీ సమస్యలే ఉన్నాయి. నివాసాలవైపు శ్మశానానికి రక్షణ గోడ లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ప్రధానంగా వీధిలో ఉండే వారితోపాటు పారిశుధ్య కార్మికులు కూడా చెత్తను తీసుకు వచ్చి ఇక్కడే పడేస్తున్నారు. మేము ఎవరైనా ఫిర్యాదు చేస్తేగానీ పడేసిన చెత్తను వారం, పది రోజులకుగానీ తొలగించరు. దీంతో తాము అనారోగ్యం పాలవుతున్నాం.

– ఫాతిమా, గౌస్‌నగర్, కడప

దోమలతో భరించలేకున్నాం



కాలనీలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం, మురుగుతో నిండిన కాలువలు ఉన్నాయి. మరోవైపు కేసీ కెనాల్ పెద్ద మురుగు కాలువను తలపిస్తోంది. దీంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా కాలనీ వాసులు వ్యాధులకు లోనవుతున్నారు. కాలనీలో పరిశుభ్రత చర్యలు చేపట్టి దోమలను నిర్మూలించి ప్రజల ఆరోగ్యాలు కాపాడాలి.

– ఖాదర్‌వలీ, గౌస్‌నగర్, కడప

సాహిత్య, నాటక రంగాలకు విశేష సేవలు


ఆచార్య మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న సుబ్బారెడ్డి, అధ్యాపకులు

కడప కల్చరల్ : జిల్లాలో సాహిత్యం, నాటక రంగాలకు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి చేసిన సేవలు ప్రశంసనీయమని శ్రీహరి డిగ్రీ కళాశాల అధినేత జి.సుబ్బారెడ్డి అన్నారు. మల్లికార్జునరెడ్డి సేవలను కొనియాడుతూ శనివారం కళాశాలలో ఆయనను ఘనంగా సత్కరించారు. నిరంతరం కళా సేవకు అంకితమైన మల్లికార్జునరెడ్డి యోగి వేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి, కర్ణాటక సంగీతం కోర్సులను తీసుకు రావడంలో ప్రధాన కృషి చేశారన్నారు. కుప్పం విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు కిన్నెర శ్రీదేవి మాట్లాడుతూ కవిగా, రచయితగా, నాటక కర్తగా, నటునిగా మల్లికార్జునరెడ్డి గుర్తింపు సాధించారని, 18 పుస్తకాలు రాశారని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు ఆర్.రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మల్లికార్జునరెడ్డి బ్రహ్మంగారిపై రాసిన పరిశోధన గ్రంథం ఆయనకు ఎంతో పేరు తెచ్చి పెట్టిందన్నారు. ఆయన రాసిన రాయలసీమ నాటక వికాసం పుస్తకానికి రాష్ట్ర ప్రభుత్వం నంది బహుమతి ఇవ్వడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు జయప్రకాశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, న్యాక్ సమన్వయకర్త భాస్కర్, కంప్యూటర్ విభాగం ప్రతినిధి ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

పొలతలలో కల్యాణ మండపం నిర్మించాలి


పొలతల ఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గిద్దలూరు రమేష్

కడప కల్చరల్ : జిల్లాలో సుప్రసిద్ధ శైవక్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పొలతల శ్రీ మల్లేశ్వరస్వామి క్షేత్రంలో విలాసమైన కల్యాణ మండపం నిర్మించాలని రాష్ట్రీయ హిందూ సేవా వాహిని సంఘటన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిద్దలూరు రమేష్ పొలతల ఈఓ కె.శ్రీనివాసులును కోరారు. ఈ మేరకు ఆయన శనివారం ఈఓ కార్యాలయంలో ఈఓను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. పొలతల మల్లేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రితో పాటు కార్తీకమాసంలో శివ పార్వతుల కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ఉత్సవాన్ని దాదాపు ఐదు వేలమందికి పైగా వీక్షించేందుకు వీలుగా నూతన కల్యాణ మండపాన్ని నిర్మించాలని కోరారు.

జాతీయ అవయవదాన దినోత్సవంపై అవగాహన


మాట్లాడుతున్న సోనియాబేగం

కడప అర్బన్ : జాతీయ అవయవదాన దినోత్సవంపై శనివారం కడప నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రిమ్స్ అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. సోనియాబేగం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. 150 మంది విద్యార్థినులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలు



సుబ్బిరెడ్డి కొట్టాలు చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్, ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు చౌడేశ్వరిదేవి ఆలయాల్లో చౌడేశ్వరిదేవి జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రామేశ్వరం మోరీల వద్ద ఉన్న చౌడేశ్వరిదేవాలయం, ఆర్టీపీపీ రోడ్డులోని అష్టభుజ మహాచౌడేశ్వరిదేవి, వసంతపేట, సుబ్బిరెడ్డికొట్టాల, పప్పుల బజార్, వినాయకనగర్, ఆచార్లకాలనీ, విజయనగరం వీధితోపాటు అన్ని చౌడేశ్వరిదేవి ఆలయాల్లో ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు. కొన్ని ఆలయాల్లో మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా బారికేడ్లను ఏర్పాటు చేశారు. అమ్మవారి జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆలయాలకు రంగులు వేయించడంతోపాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువపందిళ్లను ఆలయాల ముంగిళ్లలో ఏర్పాటు చేశారు. కొందరు ఆలయాల నిర్వాహకులు రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలో సుమారు 18పైగా చౌడేశ్వరి దేవి ఆలయాలు ఉన్నాయి. చేనేత కులాలవారితోపాటు అందరూ అమ్మవారిని ఆరాధ్య దైవంగా కొలుస్తున్నారు. జయంతి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించాలని ఆలయాల నిర్వాహకులు కోరారు.

రాజకీయ స్వార్థం కోసమే ఎస్సీ వర్గీకరణ

చాపాడు : రాజకీయ స్వార్థం కోసం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలను విభజిస్తున్నారని.. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జిల్లా నాయకులు వెంకటసుబ్బయ్య, బండి పుల్లయ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు చర్యలు తీసుకోవచ్చని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చిన క్రమంలో సుప్రీం కోర్టు మరో సారి పునఃపరిశీలించాలని శనివారం డిప్యూటీ తహసీల్దారు యామినికి శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం గురుకుల విద్యాపీఠ్ స్కూల్ వద్ద మొల్లప్రభ సౌజన్యం, జిబి హెల్త్ అండ్ వెల్‌నెస్ సంస్థ నిర్వహణలో 4వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా ఆక్యుపంక్చర్ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్ దేవపురం గిరీస్, మల్లెల రామాంజనేయులు తెలిపారు. మైగ్రేన్, పక్షవాతం, ముఖపక్షవాతం, జీర్ణ సమస్యలు, నరాల బలహీనత మొదలగు వ్యాధులకు ఉచిత వైద్య సలహాలు, సేవలు అందజేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

యువకుడిని బెదిరించిన వారిపై కేసు

కడప అర్బన్: కడప నగరంలోని ఎర్రముక్కపల్లి వద్ద ఈ నెల 2వ తేదీన మృత్యుంజయకుంటకు చెందిన ప్రశాంత్ తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా.. ఆశుపతి ఇంకా ఇద్దరితో కలిసి ఆపి చంపుతామని బెదిరించడంతో పాటు దూషించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. శనివారం బాధితుడి వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్టు

వల్లూరు (చెన్నూరు) : కడప నగరం నబీకోట్‌కు చెందిన సాన రామమోహన్‌రెడ్డిని శనివారం అరెస్టు చేసి రూ.7 వేల నగదు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూరు సీఐ నారాయణ యాదవ్ తెలిపారు. వడ్డీ డబ్బుల విషయంలో అవమానించడంతో ఆత్మహత్య చేసుకున్న శివనాథరెడ్డి కేసులో రామమోహన్‌రెడ్డిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు. నిందితుడి నుంచి ఈ సందర్భంగా ఫోన్ పే జిరాక్స్ కాపీలు, మూడు ప్రామిసరి బాండ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండుకు తరలించామని సీఐ తెలిపారు.

గంగాధరానంద గిరిస్వామి సేవలు మరువలేనివి

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణగీతాశ్రమం పూర్వ పీఠాధిపతి గంగాధరానంద గిరిస్వామి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన సేవలు మరువలేనివని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక గీతాశ్రమంలోని మళయాల స్వామి బీఈడీ కళాశాలలో శనివారం కరస్పాండెంట్ సురేష్‌బాబురెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారి 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధరానంద గిరిస్వామి గీతాశ్రమాన్ని అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక భావనలను పెంపొందించారన్నారు. ఆశ్రమంలోని విద్యాసంస్థల ద్వారా పేద విద్యార్థుల విద్యకు తోడ్పాటు అందించారని కొనియాడారు. తాను కూడా ఆశ్రమంలోని ఓరియంటల్ పాఠశాలలో చదువుకున్నానన్నారు. ఈ పాఠశాలలో సంస్కృతం నేర్చుకోవడం వలనే అవధానిగా దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించానని లేకుంటే ఏ ఉద్యోగమో చేసుకునే వాడినని తెలిపారు. ప్రముఖ వ్యాపార వేత్త సీవీ సుబ్బారావు మాట్లాడుతూ నామా ఎరుకలయ్య, నామా కమలా క్షుమ్మ, గంగాధరానంద గిరి స్వామివారి ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. గీతాశ్రమంను దేవాదాయశాఖ నుంచి తీసుకుని ఒక ట్రస్టు ఏర్పాటు చేసి దీని ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ముందుగా అందరు గంగాధరానంద గిరిస్వామి చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

బద్వేలు అర్బన్ : జంప్‌రోప్‌లో అంతర్జాతీయ స్థాయి లో ప్రతిభ చాటిన సామ్యారెడ్డి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన నందగోపాల్‌రెడ్డిలను శనివారం రెడ్డిసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని రెడ్డిసేవా సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సాంబశివారెడ్డి మాట్లాడారు. రెడ్డిసేవా సంఘం గౌరవాధ్యక్షుడు కె.వి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మొక్కలతోనే ఆరోగ్యకర వాతావరణం


మొక్కలు నాటి నీరుపోస్తున్న వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, అధ్యాపకులు

వైవీయూ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశ్రమలు వెదజల్లుతున్న కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ మానవాళికి ప్రమాదకరంగా మారాయన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు, వర్షాల కోసం విరివిగా మొక్కలు నాటాలన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ మాన్సూన్ వనమహోత్సవం విశ్వవిద్యాలయంలో పండుగ వాతావరణం తెచ్చిందన్నారు. విశ్వవిద్యాలయ బొటానికల్ గార్డెన్‌లో బిళ్లుడు, ఎర్రచందనం, మద్ది, నేరేడు, తెల్లమద్ది రకాలకు సంబంధించి 500 మొక్కలను నాటాలని నిర్ణయించామన్నారు. అలాగే వసతిగృహాల ప్రాంగణంలో 65 మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'తల్లికి ఒక చెట్టు' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 2, 8ల వలంటీర్లు, పీఓలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్రైస్తవుల ఆస్తులను కాపాడుకుందాం'


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

కడప రూరల్ : క్రైస్తవ ఆస్తులను కాపాడుకుందాం అని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో రాయలసీమ డయాసిస్ (సీఎస్ఐ టీఏ) ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జీవీ రమణ, రాయలసీమ అధ్యక్ష మండల దైవ జనులు, డివిజనల్ చైర్మన్ రెవరెండ్ ఐక్యతరావ్‌బాబు, జీఆర్‌డీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కారు అంజనేయులు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్, బీసీ నేత అవ్వారు మల్లిఖార్జున మాట్లాడుతూ క్రైస్తవులు, చర్చికి సంబంధించిన ఆస్తులకు దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. ఇందుకు సంబంధించిన ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఆ మేరకు ఈ నెల 5వ తేదీన కడప కోటిరెడ్డి కూడలిలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నేతలు వైఎం ప్రతాప్‌రెడ్డి, బండి రవికుమార్, మర్రి ప్రకాశం, షేక్ అమీన్‌పీరా, సిద్దవరం రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా పార్వతి


ఆచార్య పార్వతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులుగా వైవీయూ తెలుగుశాఖ ఆచార్యులు గోళ్ల పార్వతిని నియమించారు. శనివారం వైస్ చాన్సలర్ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి నియామక పత్రాన్ని ఆమెకు అందజేశారు. ఇప్పటి వరకు పనిచేస్తున్న ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి ఏడాది పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో ఆచార్య పార్వతిని నియమించారు. గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని నూతన సంచాలకులకు వీసీ సూచించారు. ఈ సందర్భంగా ఆచార్య జి. పార్వతిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న మునెయ్య

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె మునెయ్య, జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్ అన్నారు. కడప నగరంలోని హోచిమన్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీలలోని ఉప కులాల అభివృద్ధికి ఈ తీర్పు దోహదపడుతుందన్నారు, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రభుత్వ రంగంలో ఎస్సీలకు ఉద్యోగావకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కులగణన నిర్వహణను తీర్పు సూచించిందన్నారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ నాయకులు చంద్రగుప్త పాల్గొన్నారు.

న్యాయవాదులందరికీ న్యాయం చేయాలి


సమావేశంలో పాల్గొన్న కడప బార్ అసోసియేషన్ నాయకులు

కడప అర్బన్ : న్యాయవాదులందరికీ న్యాయం చేయాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప నాయుడు తెలియజేశారు. శనివారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో వున్న కడప బార్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా వున్న బార్ అసోసియేషన్ వారు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ న్యాయవాదుల అన్ని సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ నాయకులు, జిల్లాలోని వివిధ కోర్టుల బార్ అసోసియేషన్ వారు పాల్గొన్నారు.

అధైర్యపడవద్దు అండగా ఉంటా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడవద్దు అండగా ఉంటానని కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఎన్.పాలగిరి పంచాయతీలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికార పార్టీ నుంచి కార్యకర్తలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా వెంటనే నా దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ కరీముల్లాకు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి నివాళులర్పించారు. కరీముల్లా మృతి సమాచారం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించడంతోపాటు మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఓబుల్‌రెడ్డి అనారోగ్య కారణంగా కడప నగరంలోని ప్రైవేట్ అసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం అసుపత్రికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

జీవన ఎరువులతో నాణ్యమైన పంట

మైదుకూరు : జీవన ఎరువులతో నాణ్యమైన మిరప పంటను పండించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం మిరప సాగుపై జిల్లా స్థాయి రెండో రోజు కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, పులివెందుల అరటి పరిశోధన కేంద్రం కీటక శాస్త్రవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రారెడ్డి, వనిపెంట కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోరజ్ హుస్సేన్, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ మిరపలో విలువ జోడింపు గురించి, తెగుళ్లు, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు.